# ఖగపతీ ప్రద్యుమ్నము

ఉక్కు నగరం నుండి హస్తినాపురం వెళదామని రిజర్వేషన్‌కోసం ఖగపతి క్యూలో నిలబడ్డాడు. మరో ముగ్గురి తరువాత తనటర్న్ వచ్చేస్తుంది.

"ఏ ఊరికిరా రిజర్వేషన్ ఖగపతీ!" అని పలకరింపు.

ఖగపతి వెనక్కి చూశాడు. ప్రద్యుమ్నరావు! తనకి నలుగురి తరువాత వున్నాడు.

"దేశ రాజధానికిరా! మరి నువ్వు?"

"నేనూ దేశరాజధానికే చేయించాను. కాని ప్రయాణం రద్దయింది. రిజర్వేషన్ కేన్సిలేషన్‌కి వచ్చేన్రా!" అన్నాడు ప్రద్యుమ్నరావు.

కౌంటర్ దగ్గర ఖగపతి టర్న్‌వచ్చింది. ఖగపతి నింపి ఇచ్చిన రిజర్వేషన్ ఫారం తీసుకున్నాడు రిజర్వేషన్ గుమస్తా.

"సారీ సార్! పధ్నాలుగు వరకూ నో రూమ్. మీరు నాలుగో తేదీకే కావాలంటున్నారు" అన్నాడు రిజర్వేషన్ క్లర్కు.

"సార్ సార్! అర్జంటుగా ఢిల్లీ వెళ్లాలి" బతిమాలేడు ఖగపతి.

"సారీ బ్రదర్! ఖాళీలేందే ఏం చెయ్యమంటారు చెప్పండీ?"

"అలాకాదు సార్! మీరెలాగైనా బెర్తిప్పించాలి. మీ కష్టం వుంచుకోను"

"బెర్తులు లేందే ఎక్కణ్ణుంచి తెమ్మంటారు చెప్పండీ? ఉంటే కూరొండుకుంటామా? మీ కోసమే కదా మేము పని చేస్తున్నది?" అన్నాడు రిజర్వేషన్ గుమస్తా.

"ఏంట్రా ఖగపతీ గొడవ?" అనడిగాడు ప్రద్యుమ్నరావు.

"పద్నాలుగు వరకూ ఖాళీలేదుట్రా! - నాకేమో నాలుగో తేదీకే బెర్తుకావాలి. బెర్తులేదంటున్నారు. అర్జంటుగా వెళ్ళాలిరా ఢిల్లీ" దీనంగా అన్నాడు ఖగపతి.

"దీనికింత బెంగెందుకురా ఖగపతీ! నేను నాలుగో తేదీకే రిజర్వ్ చేసుకున్న వాణ్ణి- కేన్సిల్ చేసేసుకుంటున్నాను. నా టిక్కెట్టు మీద నువ్వు ఢిల్లీ వెళ్లరా! ఇద్దరి వయస్సూ ఇంచుమించు ఒకటే కదుట్రా! ఆ డబ్బేదో ఇలా పారెయ్!" అన్నాడు ప్రద్యుమ్నరావు.

"రక్షించావురా బాబూ! ఏదో బాల్య స్నేహితుడివి గనుక సమయానికి దేవుడిలా ఆదుకున్నావు" అన్నాడు ఖగపతి.

"మాస్టారూ! ఒకరిపేర రిజర్వయిన టిక్కెట్టు మీద వేరొకరు ప్రయాణం చెయ్యకూడదండీ! అది ఘోరమైన తప్పిదమే కాక శిక్షార్హమైన నేరం కూడాను!" హెచ్చరించాడు రిజర్వేషన్ క్లర్కు.

"చాల్ చాల్లేవయ్యా చెప్పొచ్చావ్! రూల్సు మాట్లాడుతున్నావ్ రూల్సు! రిజర్వేషన్ ఛార్జీకాక ఎక్స్ట్రా పది రూపాయలు కొట్టించెస్తే నువ్వే ఇస్తావు బెర్తు! ఛార్జీలో సగం ఇచ్చేస్తే- మీ టీ.టీ.యీ. ఢిల్లీదాకా తీసుకెళ్లి- గేటుదాకా వచ్చి మరీ సాగనంపుతాడు. ఏటోకు వర్తకుడికో సరఫరా అయే మిల్కుపౌడరు డబ్బాలు, హార్లిక్స్ సీసాలు, చక్కెర బస్తాలు, ఆర్.పీ.యఫ్. వాళ్ళతో కుమ్మక్కయి- వాగన్లకి వాగన్లే దోచుకునేవాళ్లా మాకు నీతులు బోధించడం?" అని రిజర్వేషన్ గుమస్తాపై విమర్శనాశిలీముఖాలు సంధించాడు ఖగపతి.

"చెప్పడం నా విధి. చెప్పాను. ఎవరో నూటికో కోటికో ఒకడు అవినీతిపరుడుంటాడని మొత్తం రైల్వేశాఖనే నిందించడం భావ్యంకాదు మాస్టారూ!"

"నూటికో కోటికో ఒకడా అవినీతి పరుడుండేది? అలా వుండేది నీతిపరుడని చెప్పు! తొంభై తొమ్మిది లక్షల తొంభై తొమ్మిదివేల తొమ్మిది వందల తొంభై తొమ్మిది మంది అవినీతిపరులే!" ఢంకా బజాయించాడు ఖగపతి.

"బాబూ! మీకో నమస్కారం! మీరు వెళ్లండి- ఆనెక్స్ట్" అన్నాడు రిజర్వేషన్ గుమస్తా

"అలా తోవలోకిరా" అంటూ ఖగపతి ప్రద్యుమ్నరావులు నిష్క్రమించారు. విజయగర్వంతో

ఇరవైనాలుగో నంబరు బెర్తు నాక్రమించుకుని కూర్చున్నాడు ఖగపతి. 'ప్రద్యుమ్న ప్రద్యుమ్న ప్రద్యుమ్న' అనుకుంటూ మనసులో మననం చేసుకుంటున్నాడు ఒకవేళ కండక్టరు గార్డు టిక్కెట్ చెకింగ్‌కి వచ్చి 'మీ పవిత్ర నామధేయం?' అనడిగితే, నోరుజారి 'ఖగపతి' అని చెప్పేస్తే ఇంకేమైనా వుందా? ఆఖరుకి తన పేరు ఖగపతీ కాకుండా, ప్రద్యుమ్నరావూ కాకుండా 'కటకటాల రుద్రయ్య' అయిపోతుంది!

అనుకున్నట్టే కండక్టరు వచ్చాడు. తన దగ్గరున్న ఛార్టుతో ఇరవైనాలుగో నంబరు బెర్తులో వున్న ప్రయాణికుని టిక్కెట్టు చూపించమన్నాడు. ప్రద్యుమ్నరావు అనే ఖగపతి టిక్కెట్టు చూపించాడు. ఛార్టుతో వెరిఫై చేసుకుని టిక్కెట్టు తిరిగీ ఇచ్చేశాడు కండక్టరు.

'హమ్మయ్య!' అని ఊపిరిపీల్చుకున్నాడు ఖగపతి. వురఫ్ ప్రద్యుమ్నరావు.

రాత్రి తొమ్మిదైంది. కంపార్టుమెంటులోని ప్రయాణికులు భోజనాలు ఫలహారాలు ముగించుకుని బెర్తులు సర్దుకుని, బెడ్డింగులు పరుచుకుంటున్నారు. తమ తమ బెర్తులకి దగ్గరగా వున్న లైట్లు ఆర్పుకుని ఆవలిస్తూ చిటికెలు వేస్తూ నడుములు వాలుస్తున్నారు.

తెలతెలవారుతూంది.

ఫెళఫెళార్భటులతో భూమి ప్రకంపించి, దద్దరిల్లి దిక్కులు పిక్కటిల్లేటట్లు శబ్దాలు వినిపించాయి. ఉరుములు మెరుపులతో అశని పాతాలతో ఆకాశం బ్రద్దలైనట్లు చప్పుడైంది!

సకల చరాచర సృష్టికర్త అయిన పరమ శివుడు, విష్ణుపాదోద్భవ అయిన వియద్గంగను తన ధూర్జటా జూటంలో బంధిస్తున్నప్పుడు అయే శబ్దంలా వుందది!

నటరాజు ప్రళయసంధ్యానృత్యం చేస్తున్నప్పుడు లవణ, ఇక్షు, సుర, సర్పి, దధి, క్షీర, శుద్ధోదక అనే సప్తసింధువులు ఏకమై జలప్రళయం వచ్చిందా అనిపించింది!

నిటలాక్షుడు తన త్రేతాగ్నిహోత్రనేత్రాన్ని విప్పి మన్మథుని చూసినప్పుడు, భూనభోంతరాళాలు నశ్వరమై విలయం సంభవించిందా అన్నట్టు భ్రమలు గొల్పింది!

ప్రహ్లాదుని మనుమడైన బలి చక్రవర్తిని 'మూడో అడుగు ఎక్కడ

వెయ్యమంటావు?' అని విష్ణ్వంశసంభూతుడైన వామనుడు అడిగినప్పుడు 'నా నెత్తిమీద' అనిబలి శిరసు వంచినప్పుడు, బలి శిరసుమీద కాలువేసి అథఃపాతాళానికి అణచివేసి నప్పుడు ఊర్ధ్వభాగాన వున్న భూలోక భువర్లోక స్వర్గలోక మహాలోక జనలోక తపోలోక సత్యలోకాలు, అథోభాగాన వున్న అతల వితల సుతల తలాతల రసాతల మహాతల పాతాళ లోకాలు గజగజ వణికినట్లయింది!

కృష్ణభగవానుడు కురుక్షేత్ర యుద్ధమధ్యంలో ఆయుధం పట్టి యుద్ధం చెయ్యకపోయినా తన పాంచజన్యం పూరించినప్పుడు పర్జన్యం గర్జించినట్టు నినదించింది!

ఖగపతి ప్రయాణిస్తున్న రైలుపట్టాలు తప్పింది!!!

శవాల గుట్టలు, క్షతగాత్రుల ఆర్తనాదాలు, హాహాకారాలు!

మనలో అనేకులు వివాహ సంబంధాలు కుదుర్చుకోబోయేముందు కులాలు గోత్రాలు చూసుకుంటారు. మతాలు చూసుకుంటారు. జాతకాలు చూసుకుంటారు. ఆస్తులు అంతస్తులు చూసుకుంటారు.

ఈ సకల చరాచరసృష్టికీ పార్వతీపరమేశ్వరులో, లక్ష్మీనారాయణులో కారణభూతులనుకుంటే- వాళ్లది ఏ కులమో సకల మానవాళిదీ అదేకులం కదా! కేవలం మానవులచే సృజింపబడ్డ ఈ కులమత భేదాలు, తమ తమ మతాలకు చెందిన దేవుళ్లకి ఆపాదించి, భగవంతుడికి మానవుడు కళంకం ఆపాదిస్తున్నాడు!

ఈ కులగోత్రాలతోనూ, విభిన్న మతాలతోనూ తమ కేమీ సంబంధం లేదన్నట్లు శవాలు ఐకమత్యంగానే పడివున్నాయి క్షతగాత్రులూ అలాగే పడివున్నారు.

ఆవేశాలకు ఉద్రేకాలకు లోనై, మత కలహాలతో ఒకరినొకరు హతమార్చుకునే మానవులు, కనీసం ఇటువంటి విపత్కార సమయంలోనైనా, సమైక్యంగా సమభావంతో ఆర్తనాదాలూ, హాహాకారాలూ చేస్తూ, ఆకసంవైపు సహాయం కోసం ఎదురు తెన్నులు చూస్తున్నారు!

రైల్వే అధికారులకి ఈ ప్రమాదవార్త తెలియగానే హుటాహుటిగా డాక్టర్లతోనూ, ఔషధాలతోనూ, ఆహారపదార్థాలతోనూ- రోడ్డు మార్గాన అనేక వాహనాలలో వచ్చారు. క్షతగాత్రులకి కట్టుకట్టి అంబులెన్సులలో ఆస్పత్రులకు తరలించారు.

వేరొక అధికారుల బృందం శవాల గుర్తింపు కార్యక్రమం చేపట్టింది.

శవాల చొక్కా-జేబుల్ని పేంటుజేబుల్ని తణిఖీచేశారు. డైరీల్ని వెదికారు. వాళ్ల సూట్‌కేసులలోనూ, బ్రీఫ్‌కేసులలోనూ, హాండ్‌బ్యాగులలోనూ శవాల వివరాలు తెలిస్తే, వారి వారి బంధువులకి తంతిద్వారా తెలియపరచవలసిన బాధ్యత రైల్వే అధికారులది.

ఒక దగ్గర-

తుళ్లి చెదిరిపోయి కకావికలైన ఖగపతి శవం కనబడ్డది. శవం జేబులు తడిమారు. టిక్కెట్టు దొరికింది. ప్రద్యుమ్నరావు, 35, బెర్త్ నంబరు 24, ట్రెయిన్ నంబరూ వేసి వుంది.

ప్రద్యుమ్నరావు రిజర్వేషన్ టిక్కెట్టు కొనుక్కున్న రైల్వేస్టేషన్ని కాంటాక్టు చేశారు అధికారులు. రిజర్వేషన్ అప్లికేషన్ ఫారంలో డోర్ నంబరుతో సహా ఇంటి అడ్రస్సు దొరికింది.

చనిపోయిన వ్యక్తి ప్రద్యుమ్నరావు అని తేలింది. రైల్వే అధికార్లు ఆ విషాద వార్తని తెలియపర్చడానికి జీపులో ప్రద్యుమ్నరావు ఇంటికి బయలుదేరారు.

ప్రద్యుమ్నరావు ఇంటి బయట ఓ మూడేళ్ల అబ్బాయి ఇసుకలో కాలుపెట్టి తిప్పుతూ, 'గుడుగుడుకుంచం' అంటూ ఆ ఇసుకలోనే ఉచ్చపోస్తున్నాడు.

ఇంటిముందు జీపు ఆగేక-

"బాబూ! ప్రద్యుమ్నరావు గారి ఇల్లు ఇదేనా?" అని బుజ్జగిస్తున్నట్టు అడిగాడు రైల్వే అధికారి.

"అమ్మా! ఎవలో వచ్చాలు" అంటూ తుర్రుమన్నాడు ఆ బుజ్జిపండు.

"పాపం! ఈ పసికందు తండ్రిలేని పిల్లాడైపోయేడు" తల్లడిల్లిపోయాడు రైల్వే అధికారి. ఈ బుడుతడి తల్లికి ఈ దుఃఖవార్తని ఎలా చెప్పడమా అని విచారసాగరంలో మునిగిపోయాడు. ఆమె ముఖాన బొట్టు చెరిగిపోతుంది. చేతినున్న గాజులు పగిలిపోతాయి. కాళ్ల వేళ్లకున్న మట్టెలు తీసెయ్యవలసి వస్తుంది. గళం చుట్టూ వున్న మంగళసూత్రం తెగుతుంది.

ధర్మరాజు హస్తినాపురానికి పట్టాభిషిక్తుడైన కొన్నాళ్లకి, తాను సామ్రాజ్యాధిపతి కావడానికి సర్వవిధాలసహకరించిన శ్రీకృష్ణుని యోగక్షేమాలు తెలుసుకుని రమ్మని తమ్ముడైన అర్జునుణ్ణి ద్వారకకు పంపిస్తాడు. అర్జునుడు ద్వారక చేరేసరికి కృష్ణుడు

నిర్యాణం చెందిన వార్త విని, ఖేద భాజనుడై హస్తినాపురం తిరిగి వస్తాడు. కృష్ణుని నిర్యాణవార్త ధర్మజునికి చెప్పలేక, అతని కాళ్లపై కన్నీటితో పడతాడర్జునుడు. ఎందుకో చెప్పలేకపోతాడు. నోరు మూగవోయింది.

అలాగే రైల్వే అధికారి ఇప్పుడు సందిగ్ధంలో పడ్డాడు.

అందంగా అలంకరించుకుని రత్యంశ సంభూతలా వున్న ప్రద్యుమ్నరావు భార్య, ఇంట్లోంచి బయటికి వచ్చింది.

"సోదరీ మీ భర్తగారైన ప్రద్యుమ్నరావు గారు..." అని రైల్వే అధికారి మాట పూర్తి కాకుండానే-

"ఆయనలోపలున్నారు. పిలుస్తాను కూర్చోండి" అని సావిట్లోని సోఫా-కమ్-బెడ్ చూపిందా ఇల్లాలు.

రైల్వే అధికారులు తెల్లమొహాలు వేసి ఒకరి మొహాలొకరు చూసుకుంటున్నారు.

ఇదేమిటి చెప్మా! చనిపోయింది ప్రద్యుమ్నరావు కదా?

ప్రద్యుమ్నరావు, ఇంట్లోంచి బయటికి వచ్చి, ఆ వచ్చిన అధికార్లకి నమస్కరించి తాము వచ్చిన పనేమిటో చెప్పమన్నాడు.

"ప్రద్యుమ్నరావంటే మీరేనా?"

"ఔనండీ నేనే! ఏమైంది?"

"నిజంగా మీరేనా?"

"ఔనండీ నేనే! ఏం అలా అడుగుతున్నారు? నాకు అబద్ధం చెప్పాల్సిన ఖర్మేం పట్టలేదు!" అన్నాడు ప్రద్యుమ్నరావు ధీమాగా.

"మీరు మొన్న నాలుగో తేదీ ఎక్స్‌ప్రెస్‌లో కొత్తఢిల్లీకి రిజర్వు చేసుకున్నారా?" అడిగేడో అధికారి.

"ఔను చేసుకున్నాను. అయితే?" ఎదురు ప్రశ్న వేశాడు ప్రద్యుమ్నరావు.

"అయితే ఏం లేదు. మీరు చచ్చిపోయారు! అంతే!" అన్నాడింకో అధికారి- "మీరు వెళ్లిన ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. చనిపోయినవారి జాబితాలో ప్రద్యుమ్నరావు - 35, బెర్తునంబరు - 24 అని వుంది. ఆ చనిపోయిన వ్యక్తి మీరు కాకపోతే, మీరు శిక్షార్హులు. 1964వ సంవత్సరపు భారత రైల్వేల చట్టం సెక్షన్లు 114(1) అండ్ (2) క్రింద రూ.250/-లు జరిమానా కాని, మూడు

నెలల ఖైదు కాని, లేక రెండు శిక్షలూ కాని వేయబడడానికి  మీరు అర్హులు!"

ప్రద్యుమ్నరావు నిశ్చేష్టుడైపోయాడు! తానెన్నడూ ఇంత ఘోర ప్రమాదం జరుగుతుందని ఊహించలేదు. పాపం ఖగపతి అకారణంగా బలైపోయాడు. తను వెళ్లినా అదే జరిగేది. తను తన ప్రయాణాన్ని కేన్సిల్ చేసేసుకుని - ఆరోజు ఆ టిక్కెట్‌ని ఖగపతికి అమ్మకపోయినా బావుండేది. ఇద్దరికీ మృత్యువు తప్పేది. ఇద్దరికీ శిక్షలు తప్పేవి. ఖగపతి చనిపోయినా, అతడు తప్పుడు టిక్కెట్టు మీద ప్రయాణం చెయ్యడంవల్ల, అతని భార్యకు చెల్లించవలసిన నష్టపరిహారం రైల్వే బోర్డు చెల్లించ నిరాకరించింది. ఆమెకు వైధవ్యమూ తప్పలేదు. అమాయకులైన అతని  పిల్లలు తమ తండ్రి దేవుడి దగ్గర్నుంచి ఎప్పుడు తిరిగి వస్తాడా అని ఎదురుచూస్తున్నారు!

ఇటు ప్రద్యుమ్నరావు భార్య తన భర్త ఎప్పుడు జైలునుంచి విడుదలై వస్తాడా అని - మూడు నెలలఖైదు గడువు ఎప్పుడు తీరుతుందా అని ఎదురుచూస్తోంది. మూడేళ్ల బాబుకి రోజూ అనగనగా ఓ రాజు వేట కెళ్ళి ఏడు చేపలు తెచ్చిన కథ చెబుతూ- జోలపాటలు పాడుతూ!

• స్వాతి మాసపత్రిక •
మార్చి *1992*